క్లుప్తంగా

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడలో నిర్మించిన ఉమా మహేశ్వర ఆలయంలో విగ్రహ ప్రతి ష్ఠాపన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. 6న ప్రారంభమైన ఉత్సవాలు 8వ తేదీవరకు సాగనున్నాయి. బుధవారం గోపుర ప్రతిష్ఠ, పునాది పూజ కార్యక్రమాన్ని వేదపండితులు మేఘరాజ్ శర్మ ఆధ్వర్యంలో పండిత బృందం శాస్త్రోక్తంగా చేపట్టింది. గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా గణేశ్


గణేశ్

ఆదిలాబాద్‌రూరల్: ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా అగ్గిమల్ల గణేశ్‌ను రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ నియమించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడాన్ని గతంలో ప్రకటించడం జరిగిందన్నారు. జిల్లాలో ఉద్యమ వ్యాప్తి, పార్టీ కార్యక్రమాలు, అణగారిన వర్గాలకు రాజ్యాధికారం తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని గణేశ్ తెలిపారు.

కొనసాగుతున్న 'అంగన్‌వాడీ బాట'

ఆదిలాబాద్‌రూరల్: మండలంలో అంగన్‌వాడీ బాట కొనసాగుతోంది. బుధవారం మండలంలోని అంకోలి గ్రామంలో ఐసీడీఎస్, ఏఎన్‌ఎంలు చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. అలాగే కిషోర బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం వందన, వేణుతాయి, ఈశ్వరీ దేవి, సునీత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి


మాట్లాడుతున్న ఎంపీడీవో భూమయ్య

తాంసి: దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నిర్వహించే చెరువుల పండుగను విజయవంతం చేయాలని ఎంపీడీవో భూమయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజు, భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్, తహసీల్దార్ శ్రీదేవి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సదానంద్, తదితరులు పాల్గొన్నారు.

చెరువులను ఉపయోగంలోకి తీసుకురావాలి


చెరువును పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

ఇచ్చోడ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుపయోగంగా ఉన్న చెరువులను ఉపయోగంలోకి తీసుకురావాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి భీంరెడ్డి, మాధవ్ అమ్టే, కదబాబారావులు డిమాండ్ చేశారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా బుధవారం అడేగామ (కె) చెరువును పరిశీలించారు. చెరువు నిర్మించి 19 సంవత్సరాలు గడుస్తున్నా.. నేటికి కాలువ పనులు పూర్తికాలేదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే రైతులకు సాగునీరు అందించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కేంద్రే నారాయణ, రమేశ్, కొత్తూరి సుజాత, మచ్చఅజయ్, జాదవ్ రాములు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలపై సమీక్ష



సమస్యలు తెలుసుకున్న ఇర్ఫాన్

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ కొలాం జాతి సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తామని యాక్షన్ ఏయిడ్ సంస్థ ప్రోగ్రాం అధికారి ఇర్ఫాన్ అన్నారు. జీవవైవిధ్య మేనేజిమెంట్ కమిటీ సభ్యులు మర్సుకోల తిరుపతి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పలు సమస్యలపై తీర్మానం చేశారు. రోడ్లు, విద్యుత్, తాగునీటి సమస్యలను అధి కారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు కన్ను, రాము, భీంరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల్లో కుచ్చిర్యాలతండా

- రోడ్లు, డ్రెయినేజీల్లేవ్
- సొంత డబ్బులతో రోడ్డు నిర్మించుకున్న గ్రామస్తులు
- అందని మిషన్ భగీరథ నీరు


గ్రామస్తులు నిర్మించుకున్న రోడ్డు


కుచ్చిర్యాలతండా గ్రామం

బోథ్: తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందిందని ప్రభుత్వం తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తోంది. కానీ అభివృద్ధి మాత్రం అచరణలో మాత్రం కనిపించడం లేదు. గ్రామాల్లో నేటికీ సీసీరోడ్లు, డ్రెయినేజీలు, తాగేందుకు మంచినీరు లేని గ్రామాలు ఇంకా ఉన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాలను సందర్శిస్తేనే తమ సమస్యలు తెలుస్తాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. మండలంలోని మందబొగడ గ్రామ పంచాయతీ పరిధిలో కుచ్చిర్యాలతండా అభివృద్ధికి అమడదూరంలో ఉంది. గ్రామంలో డ్రెయినేజీలు, సీసీరోడ్లు, కనీస వసతులు కరువయ్యాయి. మిషన్ భగీరథ నీరు గ్రామానికి రావడం లేదు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో 60 కుటుంబాలు 400 జనాభా ఉంటుంది. వీరంతా గ్రామం ఒడ్డున ఉన్న ట్యాంకు నీటినే తాగేందుకు, ఇతర పనులకు వాడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తమ గ్రామం పైపు కన్నెత్తి చూడకపోవడంతో గ్రామానికి వచ్చే రోడ్డును గ్రామస్తులే నిర్మించుకున్నారు.

కనిపించని డ్రెయినేజీ వ్యవస్థ..

గ్రామంలో ఎక్కడా కూడా డ్రెయినేజీ వ్యవస్థ లేదు. ఒక డ్రెయినేజీ నిర్మించిన పూర్తిస్థాయి బిల్లు కూడా రాలేదని సర్పంచ్ చాంగుబాయి ఆవేదన వ్యక్తం చేస్తోంది. దీంతో మురుగునీరు రోడ్డుపై పారుతోంది. దోమలు వృద్ధి చెందివ ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నారు.

ఊరంతా కలిసి రోడ్డు నిర్మించి..

తమ గ్రామానికి వచ్చే రోడ్డు అధ్వానంగా ఉందని, కలెక్టర్ కార్యాలయంలో, ప్రజాప్రతినిధులకు, ఎమ్మెల్యేకు విన్నవించినా.. ఎవరూ పట్టించుకోలేదు. మరోవైపు పంచాయతీలో నిధులు లేకపోవడంతో రోడ్డు నిర్మాణం జరగలేదు. పంటలను తీసుకెళ్లడానికి, యూరియా, వ్యవసాయ సామగ్రితో పాటు ఇతరత్రా వస్తువులు తీసుకురావడానికి ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఊరంతా కలిసి కుటుంబానికి రూ.5 వేల జమచేసి రోడ్డు నిర్మించుకున్నారు.

సమస్యలు తీర్చాలి



గ్రామంలో డ్రెయినేజీలు, సీసీరోడ్లు లేవు. మిషన్ భగీరథ నీరు రావడం లేదు. రోడ్డు గుంతలమయంగా మారడంతో గ్రామస్తులందరం కలిసి రోడ్డు వేసుకున్నాం. గ్రామంలోని సమస్యలను తీర్చాలి. గ్రామానికి డబుల్‌బెడ్ రూం ఇళ్లను మంజూరు చేయాలి.

– చౌహాన్ దినేష్

నిధులు కేటాయించాలి

మందబొగడ గ్రామ పంచాయతీ పరిధిలో మందబొగడ, కుచ్చిర్యాల్‌తండా, రఘునాథ్‌పూర్ గ్రామాలున్నాయి. పూర్తిస్థాయి సమస్యలను తీర్చడానికి ప్రభుత్వం విడుదల చేసే నిధులు సరిపోవడం లేదు. డ్రెయినేజీలు, రోడ్లు వేయాలంటే ప్రత్యేక నిధులు కావాలి.

– చాంగుబాయి, సర్పంచ్, మందబొగడ

'రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు'


మాట్లాడుతున్న నరేశ్‌యాదవ్

బోథ్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ఏఐసీసీ సభ్యులు నరేశ్‌జాదవ్ అన్నారు. బుధవారం మర్లపెల్లి నిగిని గ్రామాన్ని సందర్శించారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. బీఆర్‌ఎస్‌కు ప్రజలు బుద్ధి చెబుతారని మండిపడ్డారు. గ్రామానికి చెందిన కంకల ప్రశాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం పోచ్చర గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు మల్లేశ్‌ను పరామర్శించారు. ఆయన వెంట కుమరం కోటేష్, మండల కన్వీనర్ మహేందర్, పట్టణ అధ్యక్షుడు సల్ల రవి, ఆసిఫ్, కరుణాకర్, తదితరులు ఉన్నారు.


ప్రచారం చేస్తున్న వన్నెల అశోక్

గడప గడపకూ కాంగ్రెస్

తలమడుగు: మండలం లింగి గ్రామంలో గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం టీపీసీసీ సభ్యులు వన్నెల అశోక్ ఇంటింటికీ తిరుగుతూ.. రైతు డిక్లరేషన్, యువత డిక్లరేషన్ వివరించారు. కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపొందడంతో పార్టీలో మంచి ఉత్సవం వచ్చిందన్నారు. ప్రతీ కార్యకర్త కష్టపడి గెలుపు కోసం పని చేయాలన్నారు. కార్యక్రమంలో గంగారాం మహాజన్, వెంకన్న, విట్టల్, మోహన్, అశోక్, మైనారిటీ అధ్యక్షుడు రఫిక్, సంజీవ్, గోవింద్‌రావు పటేల్, బాపురావు, సోనేరావు, రామన్న, భీమన్న, నారాయణ, వినోద్ రెడ్డి, రమేశ్, రవి, రజావళి, కిషన్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

బోథ్: బోథ్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ. 2,18,000 విలువ గల చెక్కులను బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అందిస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టే కిరణ్ కుమార్, మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, జెడ్పీటీసీ సంధ్యారాణి, ఏఎంసీ వైస్ చైర్మన్ సంజీవ్ రెడ్డి, సర్పంచ్ సురేందర్, జగన్ రెడ్డి, ఎలుక రాజు పాల్గొన్నారు.

వడ్డాడిలో వైద్య శిబిరం


వైద్యశిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

తాంసి: మండలంలోని వడ్డాడి గ్రామంలో తాంసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన వ్యక్తికి డెంగ్యూ జ్వరం రావడంతో వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ తులసీరాం, సర్పంచ్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ నగేశ్, ఏఎన్‌ఎం లక్ష్మీ, ఆశ కార్యకర్త సరస్వతి పాల్గొన్నారు.

నేడు జొన్న కొనుగోళ్లు బంద్

తాంసి: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో జొన్న కొనుగోళ్లను గురువారం నిలిపివేస్తున్నట్లు సొసైటీ సీఈవో కేశవ్ తెలిపారు. మార్కెట్‌యార్డులో కొనుగోలు చేసిన జొన్న పంట నిల్వ ఎక్కువగా ఉండడంతో నిలిపివేయడం జరుగుతుందన్నారు. రైతులు జొన్న పంటను విక్రయానికి మార్కెట్‌యార్డుకు తీసుకురావద్దని సూచించారు.

కళాశాలలపై చర్యలు తీసుకోవాలి


డీఐఈవోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఎదులాపురం: అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కార్యదర్శి అక్షయ్ డిమాండ్ చేశారు. బుధవారం కళాశాలలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యాజమాన్యాల దోపిడీ కారణంగా పేద విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనుమతులు, కనీస సౌకర్యాలు లేకుండా కళాశాలలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. అనంతరం డీఐఈవో రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మహేశ్, నిఖిల్, సంజయ్, అరుణ్, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి రంగానికి పెద్దపీట

ఖానాపూర్: బీఆర్‌ఎస్ హయాంలోనే చెరువుల పునరుద్ధరణ, ప్రాజెక్టుల నిర్మాణంతో సాగునీటి రంగానికి పెద్దపీట వేసినట్లు ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని జీకే ఫంక్షన్‌హాల్‌లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాగునీటి దినోత్సవ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. అంతకుముందు సంబంధిత శాఖ ఆధ్వర్యంలో చేసిన ప్రత్యేక వీడియోను ఎమ్మెల్యే తిలకించి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. సాగు నీటిరంగంలో ప్రగతి ప్రవాహం పేరిట ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. డీఆర్‌డీవో విజయలక్ష్మి, అంకం రాజేందర్, కలీల్, మోహిద్, పుప్పాల శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, కట్ట శ్యాం, పుప్పాల గజేందర్, శ్రీనివాస్, సంతోష్, కిషోర్, నాగేశ్, తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో మల్లేశ్, ఈఈ విఠల్, డీఈఈలు సురేందర్, భోజ్‌దాస్, ఏఈఈలు ఉన్నారు.

హోంగార్డుల సమస్యలు పరిష్కరించాలి

ఖానాపూర్: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు గడుస్తున్నా.. పోలీస్‌శాఖలో పని చేసే హోంగార్డులు, కిందిస్థాయి సిబ్బంది సమస్యలను ప్రభుత్వం ఎందుకు పరిష్కరించడం లేదని బీఎస్పీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి బన్సీలాల్ రాథోడ్ ప్రశ్నించారు. బుధవారం ఖానాపూర్ ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆయన మాట్లాడారు. హోంగార్డులకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు కారుణ్య నియామకాల్లో ప్రాధాన్యం కల్పించాలన్నారు. ప్రత్యేక ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన పోలీసుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు


వేలాడుతున్న విద్యుత్ తీగలు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని పోచమ్మ గల్లిలో సవారి బంగ్లా నుంచి ఎస్‌బీఐ మెయిన్‌రోడ్డుకు వెళ్లే వీధిలో పురాతన ఇనుప స్తంభం వంగిపోయి ప్రమాదకరంగా మారింది. ఈరోడ్డు గుండా ప్రజలు బ్యాంకు, అంగడిబజార్ పనుల నిమిత్తం వస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చదువులో రాణించాలి

ఇచ్చోడ: గిరిజన విద్యార్థులు చదువులో రాణించాలని గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలల్లో ఇంటర్ రెండో సంవత్సరం ఉత్తీర్ణత సాధించిన 50 మంది విద్యార్థులతో కెరీర్ గైడెన్స్ నిర్వహించారు. హయ్యర్ ఎడ్యూకేషన్ సెల్ ఇన్‌చార్జిలు వైజనాథ్, దత్తు, సదాశివ్, మహేందర్, అర్జున్, శ్రీనివాస్, వెంకట నర్సయ్యలు మాట్లాడుతూ.. ఇంటర్ తర్వాత ఎంసెట్, ఎన్‌ఈఈటీ, లాసెట్ వంటి కోర్సులు ఉన్నాయని వివరించారు.

అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలి


బాధ్యతలు స్వీకరించిన సభ్యులు

ఇంద్రవెల్లి: అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలని అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ప్రమాణ స్వీకారం చేసి కమిటీ బాధ్యతలు స్వీకరించారు. అంబేద్కర్ చూపిన మార్గాన్ని ప్రతిఒక్కరూ అనుసరించాలన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ కార్యదర్శి కాంరాజ్, ఉపాధ్యక్షుడు శివాజీ, ఉత్తం కాంబ్లే, లహుదాస్ సావంత్, శివాజీ, దీలిప్ మోరే, రాజువర్ధాన్, శివాజీ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. మరమ్మతులు చేయండి సారూ..



బజార్‌హత్నూర్: మండలంలోని గోకొండ సమీపంలో రోడ్డు గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు కోతకు గురైంది. సగం రోడ్డు తెగిపోవడంతో ఆటోలు, స్కూలు బస్సులు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. అదుపుతప్పి వాహనం గుంతలో పడితే పెద్దమొత్తంలో ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి మరమ్మత్తులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– సంబంధిత అధికారి: నర్సింగ్, జేఈ, పీఆర్, ఫోన్: 96763 43109

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



అవగాహన కల్పిస్తున్న కస్తూరిబాగాంధీ పాఠశాల ఎస్‌వో ప్రియాంక, సిబ్బంది

నార్నూర్: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కస్తూరిబాగాంధీ పాఠశాల ఎస్‌వో ప్రియాంక అన్నారు. బుధవారం బడిబాటలో భాగంగా గాదిగూడ మండల కేంద్రంలో ఇంటింటికీ తిరుగుతూ.. సర్కారు బడిలో చదువు ప్రాముఖ్యతను వివరించారు. చిన్నారులకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కస్తూరిబాలో నాణ్యమైన విద్యానందించడానికి ప్రణాళికతో ముందుకెళ్తున్నామన్నారు. ఆమె వెంట పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇంద్రవెల్లి: ప్రభుత్వ పాఠశాలలో అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విద్యను బోధించడం జరుగుతుందని ఎంపీపీఎస్– 2 పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోడసం చిత్రు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బుద్దనగర్ కాలనీలో బడిబాట నిర్వహించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అన్ని వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంబాజీ, అర్జున్, తుకారం, భీంరావ్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్


బీజేపీ నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

ఇంద్రవెల్లి: నార్నూర్ మండలంలో ఇటీవల ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణల్లో నిందితులను అరెస్ట్ చేయాల్సిన పోలీసులు బీజేపీ నాయకులనే అరెస్ట్ చేయడం సరికాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఆరోపించారు. ఆదిలాబాద్ నుంచి నార్నూర్‌కు వెళ్తున్న బీజేపీ నాయకులను ఇంద్రవెల్లి పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారని మండిపడ్డారు. బుధవారం ఇంద్రవెల్లి పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడారు. నార్నూర్ బాధితులకు పరామర్శించేందుకు వెళ్తున్న సమయంలో అక్రమంగా అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏమున్నదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వకుళ బరణం రాజు, ఆర్క ఖమ్ము, ఆర్యన్ మహరాజ్, గుడిహత్నూర్ జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్, అరెల్లి రాజలింగు, శివకుమార్, కేంద్రే బాలాజీ, ముండే రాజేశ్వర్ పాల్గొన్నారు.

'ఆదివాసీలపై అధికారుల చిన్నచూపు'


మాట్లాడుతున్న ఆడ శంకర్

బేల: ఆదివాసీలపై మండల అధికారుల చిన్నచూపు చూస్తున్నారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు ఆడ శంకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కుమురం భీం కమ్యూనిటీ హాల్‌లో మాట్లాడారు. బురాన్‌పూర్ శివారులో ఆదివాసీ ఆరాధ్య దైవమైన మర్సుకోల రాంజీగోండ్, కుమురం సూరు జెండాలను అక్రమంగా తొలగించిన వారిపై మూడు నెలలైనా పోలీసులు చర్యలు తీసుకోలేదన్నారు. ఆదివాసీ మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించిన పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయకుంటే ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ప్రధాన కార్యదర్శి కొరంగే జంగ్‌షా, కార్యదర్శి ఆడ సంతోశ్, మడావి లక్ష్మణ్, కొరంగే సోనేరావు, పెందుర్ రాందాస్, కుషాల్‌రావు పాల్గొన్నారు.

శ్మశానవాటిక పనులు పరిశీలన


పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీల్లో చేపట్టిన శ్మశానవాటిక పనులను మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ బుధవారం పరిశీలించారు. పనుల నాణ్యత ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధికి వేల కోట్ల రూపాయలను సమీకరించుకొని అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. గతంలో లేని విధంగా ఎమ్మెల్యే జోగు రామన్న చొరవతో పనులు చేపడుతున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఆనంద్, ఆశన్న, సంతోశ్, చిన్న పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినోద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899